నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
శనివారం | అక్టోబర్ 14, 2023 | www.navatelangana.com

ఎన్నికల నేపథ్యంలో ప్రజావాణి రద్దు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర శాసనసభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ముగిసిన అనంతరం ప్రజావాణి కార్యక్రమం తిరిగి యథావిధిగా కొనసాగుతుందని తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు.

గల్ఫ్ నుంచి భర్త రాక.. భార్య అదృశ్యం

నవతెలంగాణ-రామారెడ్డి



బతుకుతెరువు కోసం గల్ఫ్ దేశం వెళ్లి 5 సంవత్సరాలు కష్టపడి గల్ఫ్ నుండి ఇంటికి వచ్చేవరకు భార్య కనిపించక పోవడంతో భర్త షాక్ తిన్నాడు. ఈ ఘటన మండలంలోని గోకుల్ తండాలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గోకుల్ తండాకు చెందిన మెగావత్ జ్యోతి గత 5 సంవత్సరాల నుండి కూతురుతో పాటు అత్తమామలతో కలిసి ఉంటుంది. గత ఐదు సంవత్సరాల క్రితం భర్త సంతోష్ బతుకుతెరువు కోసం గల్ఫ్ వెళ్ళాడు. గురువారం సాయంత్రం 7:30 నిమిషాలకు చీరలకు పాల్స్ కుట్టిస్తానని ఇంట్లో నుంచి వెళ్లిందని, అదే రోజు రాత్రి 8:00 గంటలకు ఇంటికి వచ్చిన భర్తకు, భార్య కనిపించకపోవడంతో బంధువుల ఇండ్లలో, చుట్టుపక్కల వెతికిన దొరకకపోవడంతో శుక్రవారం భర్త సంతోష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్ఐ సుభాషిని తెలిపారు.

ఆసక్తిగా ఆర్మూర్ జంగ్

- మారుతున్న సమీకరణాలు
- టికెట్, గెలుపే లక్ష్యంగా ప్రయత్నాలు
- బీఆర్ఎస్ నుంచి బరిలో జీవన్‌రెడ్డి
- పలు పార్టీల నుంచి ఇంకా ఖరారు కాని అభ్యర్థులు


జీవన్‌రెడ్డి


వినయ్‌రెడ్డి


రాకేశ్‌రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

ఆర్మూర్ నియోజకవర్గంలో పాగా వేసేందుకు అన్ని రాజకీయ పార్టీలు ప్రయత్నాలు షురూ చేశాయి. గెలుపే లక్ష్యంగా ప్రధాన పక్షాలు వ్యూహ ప్రతివ్యూహాలు రచిస్తున్నాయి. నియోజకవర్గంలో జెండా ఎగురవేసేందుకు అధికార పార్టీతో పాటు కాంగ్రెస్, బిజెపి రంగం సిద్ధం చేసుకుంటున్నాయి. అయితే ఆయా పార్టీల అభ్యర్థులు ఇంకా ఖరారు కాకపోవడంతో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

బీఆర్ఎస్ నుంచి బరిలో జీవన్‌రెడ్డి

ఆర్మూర్ టికెట్ బీఆర్ఎస్ నుంచి మూడోసారి ప్రస్తుత ఎమ్మెల్యే జీవన్‌రెడ్డికి అధిష్టానం కేటాయించిన విషయం విధితమే. సామాన్య రైతు కుటుంబం నుండి తెలంగాణ ఉద్యమకారుడి వరకు స్వరాష్ట్ర సాధన తర్వాత ప్రభుత్వంలో ప్రజాప్రతినిధిగా జీవన్‌రెడ్డి ప్రస్థానం కొనసాగుతోంది. సంక్షేమ పథకాలు మరోసారి సారి గెలిపిస్తాయని ధీమాతో ఉన్నారు. దీంతో పాటు యువకులను ఆకర్షించేందుకు ఇటీవల డ్రైవింగ్ లైసెన్స్ మేళా నిర్వహించడంతో స్పందన వచ్చింది. వేల్పూర్ మండలంలోని జాన్కంపేట గ్రామంలో జీవన్‌రెడ్డి 1976 మార్చ్ 7న వెంకట రాజన్న-రాజు భాయ్ దంపతులకు జన్మించారు. ఆయన తండ్రి గతంలో జానకంపేట గ్రామ ఉపసర్పంచిగా పనిచేయగా, మామ యాళ్ళ రాములు ఆర్మూర్ ఎంపీపీగా 1995 మార్చి 18 నుండి 1996 అక్టోబర్ 21 వరకు పనిచేశారు. రోటరీ క్లబ్ అధ్యక్షునిగా పనిచేస్తున్న సమయంలో పేద ప్రజలకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయం. దైవదర్శానానికి వెళ్తూ రోడ్డు ప్రమాదంలో మరణించారు. బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి మామ సేవ కార్యక్రమాలను ఆదర్శంగా చేసుకుని తెలంగాణ ఆవిర్భావానికి ముందు ఉద్యమం నుండి కేసీఆర్ వెంట నిలిచారు.

ఆర్మూర్ హస్తం ఎవరిదో?

తెలంగాణ ఇచ్చినప్పటికీ పదేళ్లపాటు అధికారానికి దూరంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ వచ్చే శాసనసభ ఎన్నికలలో ఖచ్చితంగా గెలిచి తీరాలనే లక్ష్యంతో సర్వశక్తులు ఒడ్డుతుంది. ఇక్కడ నుండి పోటీకి దాదాపుగా 10 మంది దరఖాస్తు చేసుకోగా ప్రధానంగా బిజెపినీ వదిలి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న పొద్దుటూరి వినయ్ రెడ్డి, ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన జిల్లా సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు గోర్తే రాజేందర్‌ల మధ్య నువ్వా... నేనా.. అనేలా పోరు నడుస్తోంది. అయితే ప్రతి పార్లమెంటు స్థానం పరిధిలోని రెండు లేదా మూడు శాసనసభ స్థానాల్లో బీసీలకు టికెట్లు కేటాయించాలని కాంగ్రెస్ డిక్లరేషన్‌లో ఉండగా గోర్తే రాజేందర్‌కు ఇవ్వాలని వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్, ఇటు జిల్లాకు చెందిన మాజీ మంత్రి, పిసిసి కోశాధికారి పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి వినయ్‌రెడ్డికి టికెట్లు కేటాయించాలని విశ్వ ప్రయత్నాలు చేసినట్లు తెలిసింది. గెలుపు అవకాశాన్ని నేతల అనైక్యత కారణంగా దూరం చేసుకోవద్దని, లక్ష్యంతో అధిష్టానం పావులు కదుపుతోంది.

సేవ కార్యక్రమాలతో ముందుకెళ్తున్న పైడి రాకేష్ రెడ్డి

అంకాపూర్ గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త పైడి రాకేష్ రెడ్డి నియోజకవర్గంలోని ఆపదలో ఉన్న వారికి ఆర్థిక సహాయం చేస్తూ బిజెపి పార్టీలో చేరి అధికార పార్టీ వైఫల్యాలే ఎజెండాగా ప్రజల సమస్యలపై పోరాటం చేస్తున్నారు. నియోజకవర్గంలోని పలు పాఠశాలలకు సైతం సేవ కార్యక్రమాలను అందించారు. పైడి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నియోజకవర్గంలోని కష్టాల్లో తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న ప్రజల సమస్యలను తెలుసుకుంటూ చైర్మన్ పైడి సుచరిత రెడ్డి ఆర్థిక సహాయం అందిస్తున్నారు. విద్య, వైద్యం ప్రతి ఒక్కరికి దక్కాలని సంకల్పంతో కార్పొరేట్ స్థాయిలో ఒక రూపాయికి వైద్య సేవలు అందించేందుకు హైదరాబాదులో హాస్పిటల్ ను సైతం ఏర్పాటు చేశారు. టికెట్ రేసులో ప్రధానంగా ఉన్నారు.

రాష్ట్రంలోనే పార్టీ గెలుపునకు అవకాశాలు ఉన్న నేపథ్యంలో సీనియర్ నాయకుల మధ్య విభేదాలు గ్రూపు తగాదాలు పొడ సూపుతున్న ప్రతి వ్యవహారంతో పాటు, విడుతల వారీగా సర్వేలు టికెట్ల కేటాయింపు నిర్ణయాధికారాన్ని అధిష్టానమే తన ఆధీనంలోకి తీసుకుంది. దీంతో బిజెపి, కాంగ్రెస్ నాయకుల అభ్యర్థుల ప్రకటనపై తీవ్ర చర్చ కొనసాగుతుంది. ఆర్మూర్ బాదుషా పోరు జిల్లా రాజకీయాలు ఎందు తీవ్ర చర్చ కొనసాగుతుంది. వేచి చూడాల్సిందే.

నిజామాబాద్ సీపీగా కల్మేశ్వర్

- కామారెడ్డి ఎస్పీగా సింధు శర్మ

నవతెలంగాణ-కంఠేశ్వర్/కామారెడ్డి


నిజామాబాద్ సీపీ కల్మేశ్వర్


కామారెడ్డి ఎస్పీ సింధుశర్మ

నిజామాబాద్ సీపీగా కల్మేశ్వర్ శింగనేవార్, కామారెడ్డి ఎస్పీగా సింధు శర్మను నియమిస్తూ సీఎస్ శాంతికుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. నిజామాబాద్ సీపీగా వచ్చిన సత్యనారాయణను కేంద్ర ఎన్నికల సంఘం బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో కల్మేశ్వర్‌ను ఎన్నికల సంఘం నియమించింది. గతంలో వివిధ ప్రాంతాలు పనిచేసిన ఆయన ముక్కుసూటిగా వ్యవహరిస్తూ వృత్తిలో విధులపట్ల కఠినంగా వ్యవహరిస్తూ సామాన్యులకు న్యాయం జరిగేలా చూస్తారని వినికిడి ఉంది.

2012 బ్యాచ్‌కు చెందిన కల్మేశ్వర్ ప్రస్తుతం హైదరాబాద్ సీసీఎస్ డీసీపీగా పని చేస్తున్నారు. అయితే ఈయన భార్య రోహిణీ ప్రియదర్శిని సైతం ఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం మెక్ మెదక్ ఎస్పీగా ఉన్నారు. ఇద్దరు కూడా తమ విధులలో నిక్కచ్చిగా ఉంటారని సమాచారం.

కామారెడ్డి ఎస్పీగా సింధుశర్మ

అయితే కామారెడ్డి ఎస్పీగా సింధుశర్మను నియమించారు. 2014 బ్యాచ్‌కు చెందిన సింధుశర్మ.. ప్రస్తుతం మన్ననూర్ 4వ బెటాలియన్ కమాండెంట్‌గా విధులు నిర్వహిస్తూ బదిలీపై కామారెడ్డికి రానున్నారు. అంతకుముందు 2018 నుండి 2023 జనవరి వరకు జగిత్యాల జిల్లా ఎస్పీగా పని చేశారు.

కబ్జాకు గురవుతున్న స్థలం పరిశీలన

- నవతెలంగాణ కథనం ఎఫెక్ట్

నవతెలంగాణ-బిచ్కుంద


కబ్జాకు గురవుతున్న స్థలాన్ని పరిశీలిస్తున్న రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ సాయిబాబా

"చదును చేసి గుట్టలను కబ్జా చేస్తున్న అక్రమార్కులు" శీర్షికతో శుక్రవారం నవ తెలంగాణలో ప్రచురమైన కథనానికి తహసిల్దార్ లక్ష్మణ్ స్పందించి కబ్జాకు గురైన స్థలాన్ని పరిశీలించాల్సిందిగా రెవెన్యూ ఇన్స్పెక్టర్ సాయిబాబాకు ఆదేశించారు. శుక్రవారం బిచ్కుంద మండల కేంద్రానికి ఆనుకొని ఉన్న పాలగుండం సమీపానగల ప్రభుత్వ భూమి 138 సర్వే నెంబర్లో ఉన్న భూమిని కొందరు వ్యక్తులు అనుమతులు లేకుండా చదును చేసి హద్దులు పాతి కబ్జా చేశారని పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి పాతిన హద్దులు తొలగిస్తామని ఎవరైనా ప్రభుత్వ భూమి కబ్జా చేయడానికి ప్రయత్నిస్తే వారిపై శాఖపరమైన చర్యలతో పాటు కఠిన చర్యలు తప్పవని రెవెన్యూ ఇన్స్పెక్టర్ సాయిబాబా హెచ్చరించారు.

మత్తుపదార్థాలతో సమాజానికి పెను ప్రమాదం

కలెక్టర్ జితేశ్ వి పాటిల్


మాట్లాడుతున్న కలెక్టర్

నవతెలంగాణ-కామారెడ్డి

మాదకద్రవ్యాలు, మత్తుపదార్థాల నిరోధానికి కలిసికట్టుగా కృషి చేయవలసిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లోని ఎన్నికల విభాగం కంట్రోల్ రూమ్‌లో అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. యువత మత్తు పదార్థాలు బానిస కాకుండా చూడాలని, ఇందుకోసం కళాశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సమాజానికి పెను ప్రమాదంగా మారిన మాదకద్రవ్యాలపై ఉక్కు పాదం మోపేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయవలసి అవసరముందని అన్నారు. మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలకు అలవాటుపడి వాటికి బానిసలుగా మారిన వారు వ్యక్తిగతంగా కుటుంబ పరంగా నష్టపోతారని అన్నారు. నియంత్రణ కోసం పోలీసు, ఆబ్కారీ, మహిళా శిశు సంక్షేమం తదితర శాఖలు చిత్తశుద్ధితో కృషిచేయాలని ఆదేశించారు. మత్తుపదారాలకు బానిసలైన వారికి కౌన్సిలింగ్ ఇచ్చి పూర్వ స్థితికి తేవాలని, వారికి పునరావాసం కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఆబ్కారీ సూపరింటెండెంట్ రవీంద్ర రాజు, పోలిసు అధికారులు, డిఆర్ డిఓ సాయన్న, జిల్లా సంక్షేమాధికారి బావయ్య, తదితర బీఅధికారులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణలో నిర్లక్ష్యానికి తావివ్వొద్దు

- రైతులను ఏ దశలోనూ ఇబ్బందులు పడొనీయొద్దు
- విస్మరిస్తే అధికారులపై చర్యలు
- సన్నాహక సమావేశంలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు


మాట్లాడుతున్న కలెక్టర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రస్తుత ఖరీఫ్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించే విషయంలో నిర్లక్ష్యానికి తావిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు హెచ్చరించారు. ఏ దశలోనూ ఇబ్బందులు ఏర్పడకుండా సాఫీగా ధాన్యం సేకరణ ప్రక్రియ కొనసాగేలా సమగ్ర ప్రణాళికతో ముందుకెళ్లాలని సంబంధిత అధికారులకు సూచించారు. వానాకాలం పంట ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో శుక్రవారం ఆయా శాఖల అధికారులతో, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల చైర్మన్లు, సీఈఓలు, ఐకెపి సీసీలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పంట విక్రయం విషయంలో రైతులు ఇబ్బందులకు గురికాకుండా, పూర్తి పారదర్శకంగా ధాన్యం సేకరణ జరగాలన్నారు. అధికారులు, సిబ్బంది తప్పిదాల వల్ల ఎక్కడైనా రైతులు ఆందోళనలకు దిగితే, సంబంధిత అధికారులనే బాధ్యులుగా పరిగణించి కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. రైతులకు నష్టం వాటిల్లకుండా తూకం, తరుగు వంటి అంశాల్లో జాగ్రత్తగా ఉండాలని, ధాన్యం సేకరణ ముగిసేంత వరకు పకడ్బందీ పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. నాణ్యతా ప్రమాణాలకు లోబడి ధాన్యం తీసుకువచ్చే రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మేరకు ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాల్‌కు 2203 రూపాయలు, సాధారణ రకానికి 2183 రూపాయలు మద్దతు ధర అందేలా చూడాల్సిన గురుతర బాధ్యత అధికారులపై ఉందన్నారు.

సంబంధిత శాఖల అధికారులందరూ సమిష్టిగా, సమన్వయంతో పనిచేస్తూ ధాన్యం సేకరణ ప్రక్రియను విజయవంతం చేయాలన్నారు. ఎఫ్ఏక్యూ ప్రమాణాలకు లోబడి బాగా ఆరబెట్టి, శుభ్రపర్చిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేలా క్షేత్ర స్థాయిలో రైతులను చైతన్యపరచాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. రైతుల నుండి ఏ చిన్న ఫిర్యాదు సైతం రాకుండా చూసుకోవాలని, ధాన్యం సేకరణలో క్షేత్రస్థాయి అధికారులు క్రియాశీలక పాత్ర పోషించాలని సూచించారు. ముఖ్యంగా ధాన్యం రవాణాకు సరిపడా సంఖ్యలో వాహనాలను సమకూర్చుకోవాలని, ధాన్యం ఎగుమతులు, దిగుమతులు వెంటదివెంట జరిగేలా అవసరమైన సంఖ్యలో హమాలీలు ఏర్పాటు చేసుకోవాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని నిలువ చేసేందుకు తగిన ప్రదేశాలను గుర్తించాలని సూచించారు. అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోకుండా కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని, బాగా ఆరబెట్టిన, శుభ్రపర్చిన ధాన్యం మిల్లులకు పంపాలని అన్నారు.

కాగా, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున కొనుగోలు కేంద్రాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులతో ప్రారంభోత్సవాలు చేయించకూడదని, అధికారులు ప్రారంభించాలని కలెక్టర్ సూచించారు. ఫ్లెక్సీలలో కూడా ఫోటోలు ఉండకూడదని, కేవలం రైతులకు ఉపయోగపడే సూచనలు మాత్రమే ముద్రించాలని తెలిపారు.

అదనపు కలెక్టర్ పి.యాదిరెడ్డి మాట్లాడుతూ, ధాన్యం సేకరణ ప్రక్రియను నిశితంగా పర్యవేక్షించేందుకు జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. సంబంధిత శాఖల అధికారులు ధాన్యం కొనుగోళ్లను నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎక్కడైనా సమస్యలు ఉత్పన్నమైతే వెంటనే పరిష్కరిస్తారని అన్నారు. నాణ్యతా ప్రమాణాలను సాకుగా చేసుకుని రైతులను నష్టపర్చే ప్రయత్నాలను ఎంతమాత్రం ఉపేక్షించబోమని, రైతుల ప్రయోజనాలతో ముడిపడి ఉన్న అంశమైనందున ఎట్టిపరిస్థితు ల్లోనూ రాజీ పడకూడదని అధికారులకు సూచించారు. నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం సేకరణకు అవసరమైన గన్నీ బ్యాగులను అన్ని కేంద్రాలకు సమకూరుస్తామని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని వెంటదివెంట రైస్ మిల్లులకు తరలించేలా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. జిల్లా యంత్రాంగం తరపున అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తామని, ఏ చిన్న ఇబ్బందికి సైతం తావులేకుండా ధాన్యం సేకరణ ప్రక్రియను సజావుగా నిర్వహించాలని, క్షేత్రస్థాయిలో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. సమావేశంలో డీఎస్ఓ చంద్రప్రకాశ్, డీసీఓ సింహాచలం, జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్, డీఆర్డీఓ చందర్ తదితరులు పాల్గొన్నారు.

సునీల్‌రెడ్డి కూతురు సమన్వి మృతి

- శోకసంద్రంలో కాంగ్రెస్ శ్రేణులు


సమన్వి అంత్యక్రియలకు హాజరైన ప్రజలు, కార్యకర్తలు

నవతెలంగాణ-మెండోరా

నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ నేత ముత్యాల సునీల్ రెడ్డి కుమార్తె ముత్యాల సమన్వి (16) గురువారం రాత్రి హైదరాబాద్ తమ నివాస గృహంలో బాత్రూంలో జారిపడి తలకు గాయమై మృతి చెందింది. దీంతో నియోజకవర్గంలో విషాదచాయలు అలుముకున్నాయి. శుక్రవారం బాల్కొండ నియోజకవర్గంలోని మెండోరా మండలంలోని సావెల్ గ్రామంలో సమన్వి అంత్యక్రియలు నిర్వహించారు. నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ ముఖ్య నాయకులు అంత్యక్రియలో పాల్గొన్నారు. కుటుంబ సభ్యులు, నాయకులు, గ్రామ ప్రజలు శోకసంద్రంలో మునిగిపోయారు.

తనిఖీల్లో లక్ష నగదు స్వాధీనం

నవతెలంగాణ-రెంజల్

రెంజల్ మండలం కందకుర్తి గోదావరి వద్ద ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్ట్ వద్ద గురువారం తనిఖీలు చేయగా.. లక్ష రూపాయల నగదు స్వాధీనం చేసుకు న్నారు. రియాన్ షేక్ నగదుకు సంబంధిం చిన పత్రాలు చూపకపోవడంతో అట్టి డబ్బులను స్వాధీనం చేసుకున్నట్లు రెంజల్ ఎస్సై ఉదయ్ కుమార్ తెలిపారు. మహారాష్ట్రలోని చాకుర్ గ్రామం, లాతూర్ తాలూకాకు చెందిన రియాన్ షేక్ ద్వారా లక్ష రూపాయలను స్వాధీనం చేసుకొని, తదుపరి చర్య కోసం ఫ్లయింగ్ స్క్వాడ్ కు అప్పగించినట్టు తెలిపారు. ఆయన వెంట చెక్ పోస్ట్ సిబ్బంది గోపికృష్ణ, సయ్యద్ అజీమ్, శంకర్ రెడ్డి, మరో ఇద్దరు పోలీస్ సిబ్బంది ఉన్నారు.

మంత్రి వేముల మాతృమూర్తికి కన్నీటి వీడ్కోలు

- పుష్పాంజలి ఘటించిన సీఎం కేసీఆర్, మంత్రులు, పలువురు ప్రముఖులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి


అంత్యక్రియలకు హాజరైన జనం..


నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్సీ కవిత..


నివాళి అర్పించి మంత్రి వేములతో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్

రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి మాతృమూర్తి మంజులమ్మ అంత్యక్రియలు శుక్రవారం వారి స్వగ్రామం నిజామాబాద్ జిల్లా వేల్పూర్‌లో అశ్రునయనాల మధ్య పూర్తయ్యాయి.

వేల సంఖ్యలో ప్రజలు వేముల కుటుంబం అభిమానులు అంత్యక్రియలకు హాజరయ్యారు. మంజులమ్మకు అశ్రు నయనాలతో వీడ్కోలు పలికారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక హెలికాప్టర్లో వేల్పూర్‌కు వచ్చి మంజులమ్మ పార్థివ దేహంపై పూలమాలలు ఉంచి నివాళులు అర్పించారు. మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డికి ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. సీఎంతో పాటు స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, రాజ్య సభ సభ్యుడు జోగినపల్లి సంతోష్, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర రెడ్డి, జీవన్ రెడ్డి, బిగాల గణేష్ గుప్తా, జజాల సురేందర్, హన్మంతు షిండే, షకీల్, విద్యాసాగర్ రావు, పలువురు అధికారులు, రాష్ట్ర ప్రజాప్రతినిధుల, ఎమ్మెల్సీలు శేరి సుభాష్ రెడ్డి, వెంకట్రామిరెడ్డి పలువురు రాష్ట్ర కార్పొరేషన్ల చైర్మన్లు, ఎంపీ ధర్మపురి అరవింద్, తదితర ముఖ్య నాయకులు హాజరై నివాళి అర్పించి, అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

అనంతరం మంజులమ్మ అంతిమ యాత్ర వేలాది మంది జనం మధ్య సాగింది. ఈ సందర్భంగా మంత్రి ప్రశాంత్ రెడ్డి, ఆయన కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. తల్లి పార్థివ దేహం వద్ద మంత్రి వెక్కెక్కి ఏడ్చిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది.

నివాళులు అర్పించిన ప్రముఖులు..

రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి మాతృమూర్తి మంజులమ్మ పార్థివ దేహానికి పలువురు ప్రముఖులు నివాళులు అర్పించారు. స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, రాజ్య సభ సభ్యుడు జోగినపల్లి సంతోష్, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర రెడ్డి, జీవన్ రెడ్డి, బిగాల గణేష్ గుప్తా, జజాల సురేందర్, హన్మంతు షిండే, షకీల్, విద్యాసాగర్ రావు, పలువురు అధికారులు, రాష్ట్ర ప్రజాప్రతినిధుల, ఎమ్మెల్సీలు శేరి సుభాష్ రెడ్డి, వెంకట్రామిరెడ్డి పలువురు రాష్ట్ర కార్పొరేషన్ల చైర్మన్లు, ఎంపీ ధర్మపురి అరవింద్, తదితర ముఖ్య నాయకులు హాజరై నివాళి అర్పించి, అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

నిరుపయోగంగా గోపాల్ మిత్ర భవనం



నవతెలంగాణ-రెంజల్

మండలంలోని బోర్గం గ్రామంలో నిర్మించిన గోపాల్ మిత్ర భవనం నిరుపయోగంగా మారింది. బోర్గం గ్రామంలో పశుసంపదతో పాటు, గొర్రెలు మేకలు అధిక సంఖ్యలో ఉండడం వలన ఇక్కడ ఈ భవనాన్ని నిర్మించారు. ఈ భవన నిర్మాణాన్ని రూ.8 లక్షల 40 వేల రూపాయల వ్యయంతో నిర్మించగా కొన్ని రోజులు మాత్రమే వాడకంలో ఉంది. ప్రస్తుతం గ్రామంలోని నీరు ఈ భవనం చుట్టూ చేరడం, కాంట్రాక్టర్ భవనంలోని నాసిరకంగా పనులు నిర్వ హించడం వల్ల పాములు రావడంతో దానిని శాశ్వతంగా మూయించారు. అలా గే చుట్టూ ముళ్లపొదలు చెట్లతో నిండుకొని ఉంది. స్థానిక వైద్య సిబ్బంది రైతుల ఇంటి వద్దనే వైద్యం చేస్తూ ఉండటంతో ఇది నిరుపయోగంగా మారింది.

రాష్ట్రస్థాయి సీనియర్ మహిళల సాఫ్ట్‌బాల్ పోటీలకు ధర్మారం బి విద్యార్థిని



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండలంలోని ధర్మారం బిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ పాఠశాల, కళాశాల విద్యార్థిని సారియూ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ సంగీత శుక్రవారం తెలిపారు. ఈ విద్యార్థిని ఈనెల 15 నుండి 17 వరకు వరంగల్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలలో మంచి ప్రతిభని కనబరిచి జాతీయ స్థాయికి ఎంపిక కావాలని సంగీత పేర్కొన్నారు. కార్యక్రమంలో స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ నీరజరెడ్డి, పిఈటీ జోష్న, హౌస్‌మాస్టర్ విక్టోరియా పాఠశాల సిబ్బంది అభినందించారు.

ఫ్యాక్టరీని తెరిపించే వరకూ దీక్షలను కొనసాగిస్తాం



దీక్షలు నిర్వహిస్తున్న ఫ్యాక్టరీ కార్మికులు

నవతెలంగాణ-బోధన్‌టౌన్

బోధన్ నిజాంషుగర్ ఫ్యాక్టరీని తెరిపించే వరకూ దీక్షలను కొనసాగిస్తామని ఫ్యాక్టరీ కార్మికులు హెచ్చరించారు. ఫ్యాక్టరీ కార్మికులు బోధన్ పట్టణంలోని నిజాంషుగర్ ఫ్యాక్టరీ ఎదుట చేపడుతున్న దీక్షలు శుక్రవారం నాటికి 70వ రోజుకు చేరుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఫ్యాక్టరీని పున:ప్రారంభించాలని డిమాండ్ చేశారు. దీక్షలో ఫ్యాక్టరీ కార్మికులు తదితరులు కూర్చున్నారు.

కలెక్టర్‌కు కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో గృహలక్ష్మీ పథకం, దళితబంధు, బీసీబంధును ప్రతి గ్రామాలలో ప్రొసీడింగ్స్ ఇస్తూ కార్యక్రమాలు కొనసాగిస్తున్నారని, ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన సమయంలో ఇలాంటి కార్యక్రమాలకు ప్రొసీడింగ్స్ ఇవ్వడం ఎలక్షన్ కమిషన్ రూల్స్‌కు వ్యతిరేకమని, కావున ఈ కార్యక్రమాలను కలెక్టర్ దృష్టికి నిజామాబాద్ రూరల్ కాంగ్రెస్ నియోజకవర్గం ఇంచార్జ్ డాక్టర్ ఆర్.భూపతిరెడ్డి, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ముప్ప గంగారెడ్డి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

వేముల మంజులమ్మకు నివాళులర్పించిన ఎమ్మెల్యే షకీల్

నవతెలంగాణ-బోధన్

రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తల్లి వేముల మంజులమ్మ గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. శుక్రవారం వేల్పూర్ మండల కేంద్రంలోని మంత్రి వేముల నివాసంలో అంత్యక్రియలు జరగనుండడంతో సీఎం కేసీఆర్ శుక్రవారం వేల్పూర్ మండల కేంద్రంలోని మంత్రి నివాసానికి చేరుకొని వేముల మంజులమ్మ పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట బోధన్ ఎమ్మెల్యే షకిల్ ఆమేర్ పాల్గొని వేముల మంజులమ్మ పార్థివ దేహానికి నివాళులర్పించారు. అనంతరం మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డిని ఓదార్చారు.

అంత్యక్రియల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-ముప్కాల్

స్వర్గీయ వేముల సురేందర్ రెడ్డి సతీమణి, రాష్ట్ర రోడ్లు, భవనాలు, గృహనిర్మాణశాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి మాతృమూర్తి వేముల మంజుల రెడ్డి హైదరాబాద్‌లోని ఒక ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం తుదిశ్వాస విడిచారు. అంత్యక్రియలు మంత్రి స్వగ్రామమైన నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండల కేంద్రంలో శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో నిర్వహించారు. కాగా మండల కేంద్రం నుంచి ఎంపీపీ సామ పద్మ-వెంకట్ రెడ్డి, జడ్పీటీసీ సభ్యులు బద్దం నర్సవ్వ-నర్సారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు ముస్కు భూమేశ్వర్ రెడ్డి, వైస్ ఎంపీపీ ఆకుల చిన్న రాజన్న, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు నాగంపేట్ ముత్తెన్న, కో ఆప్షన్ సభ్యులు మునిరొద్దీన్, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఉమ శంకర్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, ఉప సర్పంచులు, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ నాయకులు, యువజన సంఘం నాయకులు తదితరులు పాల్గొని సంతాపం ప్రకటించారు.

అవయవ దానంపై అవగాహనా సదస్సు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న అనిల్ శ్రీవత్స

నవతెలంగాణ-ఆర్మూర్

రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో అధ్యక్షులు పట్వారి గోపికష్ణ అధ్యక్షతన అవయవ దానంపై అవగాహన సదస్సును పట్టణంలోని నరేంద్ర డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా అవయవ దానంపై అవగాహన కల్పించడానికి వక్త అనిల్ శ్రీవత్స (పుణె) నుండి వచ్చి విద్యార్థులకు అవయవదానంపై అవగాహన కల్పించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ జీవన విధానంలో అవయవ దానం ప్రాముఖ్యత ప్రతి ఒక్కరికి తెలిసి ఉండాలని, అత్యవసర సమయంలో అవయవదానం ఇవ్వడం చేత ఆ వ్యక్తికి పునర్జన్మ ఇచ్చిన వాళ్ళం అవుతామని నేటి యువతరం, ప్రజలు ప్రతి ఒక్కరూ అవగాహన కల్పించుకొని సేవలో ముందుండాలని వారు కోరారు. అధ్యక్షులు పట్వారి గోపి కష్ణ మాట్లాడుతూ అనిల్ ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల్లో పర్యటిస్తూ రోటరీ సభ్యులుగా అవయవ దానంపై అవగాహన కల్పిస్తూ దేశంలో ప్రాణాలు కోల్పోయే వారిని రక్షిస్తున్నారని వారి సేవలు చాలా అమూల్యమైనవని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు వారి సందేహాలకు సమాధానాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి పట్వారి తులసి, రోటరీ సభ్యులు పుష్కరావు, గోనే దామోదర్, గోనే శ్రీధర్, కళాశాల ప్రిన్సిపాల్ రాజేందర్, ఇంచార్జ్ గంగాధర్ విద్యార్థులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

మహిళ డిగ్రీ కళాశాలలో అమృత కలశ ర్యాలీ

నవతెలంగాణ-ఆర్మూర్

తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళ గురుకుల డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మేరీ మట్టి మేరీ దేశ్ అమృత కలుష యాత్రలో భాగంగా కళాశాల ప్రాంగణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా మట్టి బియ్యం సేకరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జి.ధనవేణి విద్యార్థినులను ఉద్దేశించి ప్రసంగించారు. యువతలో దేశభక్తి ఉండాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శరణ్య, ఎన్ఎస్-ఎస్ కోఆర్డినేటర్ చైతన్య శాంతి, అధ్యాపకులు విద్యార్థినిలు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినిలు

రియల్ ఎస్టేట్ వ్యాపారుల కబ్జాలను నివారించాలి

- అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలివ్వాలి
- సీపీఐ(ఎం.ఎల్) ప్రజాపంథా

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం.ఎల్) ప్రజాపంథా నిజామాబాద్ నగర్ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ(ఎంఎల్) ప్రజాపంథా నగర కార్యదర్శి ఎం.సుధాకర్, డివిజన్ సహాయ కార్యదర్శి సీహెచ్. సాయగౌడ్ మాట్లాడుతూ.. నిజామాబాద్ నగరంలోని 5వ డివిజన్ పరిధిలోని అర్హులైన నిరుపేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేస్తున్న బోర్గం(పి) శివారు చెరువుకట్ట ప్రభుత్వ భూమిలో సిపిఐ(ఎంఎల్) ప్రజాపంథా నాయకత్వంలో భూమి చదునుచేస్తేనే పోలీసులు అరెస్టు చేశారన్నారు. ఈ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సంవత్సర కాలంగా అదే భూమిని రియల్ వ్యాపారులు కబ్జా చేసి, ఫెన్సింగ్ వేస్తే రెవెన్యూ అధికారులు, పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వం, రెవెన్యూ అధికారులు రియల్ వ్యాపారులవైపా...? నిరుపేదలవైపా...? చెప్పాలన్నారు. మోపాల్ మండల రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూములను భూ కబ్జాదారుల నుంచి స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఆ భూముల్లో బోర్గం(పి), మహాలక్ష్మినగర్, ఆర్యనగర్ వినాయకనగర్, మాధవనగర్, పాంగ్రాల్లో నివసిస్తున్న అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలను కేటాయించాలన్నారు. అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేవరకు పోరాటం ఆపేది లేదన్నారు. ఓట్లు కావాలంటే, నిరుపేదలకు ప్లాట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ(ఎంఎల్) ప్రజాపంథా నాయకులు డి.గంగమల్లు, జి.గంగారం, అశుర్, ముత్యాల నారాయణ, లక్ష్మి, సుమలత, రాజేష్, అమూల్య, సావిత్రి, లలిత, మల్లేష్, అక్బర్, విజయ, కళావతి, నర్సింలు, గంగాధర్, సంతోష్, సుగుణ తదితరులు పాల్గొన్నారు.



ఏవోకు వినతి పత్రాన్ని అందజేస్తున్న నాయకులు

బీఈడీ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో అధిక ఫీజులు వసూలు చేస్తున్న రాఘవేంద్ర బి.ఈడి కళాశాలపై చర్యలు తీసుకోవాలని, ఆ కళాశాల గుర్తింపును రద్దు చేయాలని తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.యాదగిరికి నగర అధ్యక్షుడు అఖిల్ వినతిపత్రాన్ని శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా నగర అధ్యక్షుడు అఖిల్ మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లాలోని ఆర్మూర్‌లో గల రఘువేంద్ర బీఈడీ కళాశాల విద్యార్థుల వద్ద అధిక పరీక్ష ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తూ సెమిస్టర్ పరీక్షల ఫీజు రూ.1440 చెల్లించాల్సి ఉండగా ఒక్కొక్కరి వద్ద నుండి రూ.2500 వసూలు చేస్తూ విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని వివరించారు. డెవలప్మెంట్ ఫీజులు, అటెండెన్స్ ఫీజుల పేరుతో విద్యార్థుల వద్ద అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, అ కళాశాల్లో కనీస అధ్యాపకులు లేరని పేర్కొన్నారు. మౌలిక సదుపాయాలు, వసతులు లేకుండా కళాశాల నడిపిస్తున్నారని రాఘవేంద్ర కళాశాలపై వెంటనే చర్యలు తీసుకుని కళాశాల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహేష్, సుజిత్, సొహెల్, అదీబ్ తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రాన్ని అందజేస్తున్న నాయకులు

ఈనెల 16న అప్రెంటీస్ షిప్ మేళా

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఐటీఐలో పాసైన అభ్యర్థులకు వివిధ పరిశ్రమలలో ఎంఎస్డిఈ, సిఈటీ హైదారాబాద్ వారి ఉత్తర్వులను అనుసరించి, ప్రధానమంత్రి జాతీయ అప్రెంటీస్ షిప్ మేళా నిర్వహించనున్నట్టు కమ్మర్‌పల్లి ఐటిఐ ప్రిన్సిపాల్ కే.శాంతరాం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అవకాశాన్ని నిజామాబాద్, నిర్మల్ జిల్లాలో అర్హులైన అభ్యర్థులు తమ వెంట సంబంధిత విద్యార్హత ధృవీకరణ పత్రాల జిరాక్స్‌లను తీసుకొని అప్రెంటీస్ వెబ్సైట్ ఖుఖుజూతీవఙఅఎవంస్త్రఖుజూఖఅఎఖు.శీతీస్త్ర నందు రిజిస్ట్రేషన్ చేసుకొని ఈనెల 16 న ఉదయం 10 గం.లకు అప్రెంటిస్ మేళాకు హాజరు కావాలని తెలిపారు. ఎంపికైన వారికి ప్రతినెల స్టయిఫండ్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. మరింత వివరాలకు సెల్ నెంబర్ 9440435887కు సంప్రదించాలని సూచించారు. అభ్యర్థి దరఖాస్తు ఫారం నింపడానికి ఎస్ఎస్సి సర్టిఫికెట్, ఐటీఐ మార్క్ షీట్, ఆధార్ కార్డ్, పాన్ కార్డ్, పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు 2, అప్రెంటిషిప్‌కు దరఖాస్తు చేసుకున్న సర్టిఫికెట్‌తో రావాలని సూచించారు.

చదివే అలవాటుతోనే.. విద్యార్థుల విజయాల ప్రభావం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని సారంగాపూర్ ఎడ్యుకేషన్ కళాశాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ వన్నెల దాసు శ్రీనివాస్ నాగార్జున యూనివర్సిటీ నుంచి సెకండరీ పాఠశాల విద్యార్థుల పఠణ అలవాట్లు-సాధించిన విజయాలు అనే అంశంపై సిద్ధాంత గ్రంథాన్ని అందించినందుకు డాక్టరేట్ ప్రదానం చేశారు. పీహెచ్‌డీ పర్యవేక్షకులుగా ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ బలరాములు వ్యవహరించారని, నాగార్జున యూనివర్సిటీ పీహెచ్‌డీ వింగ్ కోఆర్డినేటర్ ఏ సోమశేఖర్ తెలిపారు. సెకండరీ గ్రేడ్ స్థాయిలో పిల్లల సరైన వేళలో జరిగే రీడింగ్ అలవాట్లే విద్యార్థుల విజయాలను ప్రభావితం చేస్తాయని పరిశోధనలో తెలిసిందని పేర్కొన్నారు. మౌన పఠనం ద్వారా విద్యార్థుల్లో గ్రహకశక్తి అధికంగా ఉంటుందని తాను సేకరించిన దత్తాంశం ద్వారా బహిర్గతమైందని పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లా బాల్కొండ మండలం, కిసాన్‌నగర్ గ్రామంలో పేద కుటుంబంలో వన్నెల దాస్ నర్సుబాయ్ శ్రీ.శే-వెంకన్నకు జన్మించిన, వన్నెల దాస్ శ్రీనివాస్ బాల్యం నుంచి అనేక కష్టాలను ఎదిరించి ఉన్నత విద్యను అభ్యసించడం గర్వంగా ఉందని రిజిస్ట్రార్ పేర్కొన్నారు. తెలంగాణ యూనివర్సిటీ విద్యా కళాశాల సారంగాపూర్‌లో పనిచేస్తున్న వన్నెలదాస్ శ్రీనివాస్ పరిశోధన విద్యారంగంలో జరిగే ఆధునిక మార్పులకు ఒక దిక్సూచిగా ఉంటుందని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.యాదగిరి పేర్కొన్నారు. విద్యారంగంలో మరిన్ని పరిశోధనలు చేయాలని శ్రీనివాస్‌ను అభినందించారు.



వెన్నెల దాసు శ్రీనివాస్‌ను అభినందిస్తున్న దృశ్యం

బోధన్ పోస్టాఫీస్‌లో ఆధార్ సేవలు పునరుద్ధరణ

నవతెలంగాణ-బోధన్

పట్టణంలోని పోస్టాఫీస్‌లో ఆధార్ సేవలను పునరుద్ధరించినట్లు పోస్టల్ ఇన్‌స్పెక్టర్ వేణు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త ఆధార్ కార్డు పొందేవారు, ఆధార్‌కు ఫోన్ నెంబర్ అనుసంధానం చేయుట, ఆధార్ అప్‌డేట్ చేయడం, బయోమెట్రిక్ రేషన్ ప్రక్రియ లాంటి సేవలను నామమాత్రపు రుసుముతో పోస్టాఫీస్‌లో చేయనున్నట్లు పేర్కొన్నారు. కావున బోధన్ సమీప ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

మందకృష్ణ పాదయాత్రకు వీ.హెచ్.పీ.ఎస్ సంఘీభావం

నవతెలంగాణ-బోధన్

శీతాకాల పార్లమెంటు సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ అల్లంపూర్ నుంచి మాదిగల విశ్వరూప మహా పాదయాత్ర నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ పాదయాత్రకు శుక్రవారం 7వ రోజు వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ మహిళ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ, కోర్ కమిటీ చైర్మన్ ఎల్.గోపాల్‌రావు, కోచైర్మన్ అందే రాంబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి కే నరసింహ, వరంగల్ జిల్లా నాయకులు రాజు పాదయాత్రలో పాల్గొని సంఘీభావం తెలిపారు.

ఫ్యూచర్ లైన్ స్కూల్లో బతుకమ్మ వేడుకలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలతో బతుకమ్మను తెలంగాణ రంగుల పూల పండుగగా జరుపుకుంటారని ఫ్యూచర్ లైన్ పాఠశాల ప్రిన్సిపాల్ స్వప్న అన్నారు. తెలంగాణలో ప్రసిద్ధి చెందిన బతుకమ్మ పండుగను పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని ఆర్యనగర్‌లో గల ఫ్యూచర్ లైన్ స్కూల్లో బతుకమ్మ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దసరా పండుగకు రెండు రోజులు ముందు సద్దుల బతుకమ్మగా ఆచరిస్తారన్నారు. వారం రోజులపాటు రంగుల పూల పండుగను మహిళలు, చిన్నారులు ఆనందోత్సాల మధ్య ప్రతిరోజు సాయంత్రం, ఆర్భాటంలో నిమగ్నమై ఉంటారని తెలిపారు. ఇక చివరి రోజు రంగుల పూల బతుకమ్మను నీటిలో వదలడం ఆనవాయితీగా వస్తున్న ఆచరంగా జరుపుకుంటున్నట్లు వివరించారు. దీంతో నీటి కాలుష్యం నివారించవచ్చని పూర్వీకులు తెలుపుతున్నారని అన్నారు. ఇందులో భాగంగా ఉపాధ్యాయినిలు, విద్యార్థులు తెలంగాణ సాంప్రదాయ బద్ధంగా పూలను అలంకరించుకుని బతుకమ్మ పాటలు పాడి రంగులు పూల పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీలత, సుమలత, మంజుల, గౌతమి ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



ఫ్యూచర్ లైన్ పాఠశాలలో బతుకమ్మ వేడుకలు



బిఈడి కళాశాలలో బతుకమ్మ వేడుకలు

సారంగాపూర్ బీఈడీ కళాశాలలో ఘనంగా బతుకమ్మ

నిజామాబాద్ రూరల్: తెలంగాణ యూనివర్సిటీ సారంగాపూర్‌లోని బి.ఈ.డి. కళాశాలలో డాక్టర్ ప్రిన్సిపాల్ సాయిలు అనుమతి మేరకు బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో విజయలక్ష్మి, సువర్చల, హరిత, నవీన, సుజత్, శోభ అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

17వ రోజుకు చేరుకున్న రిలే నిరాహారదీక్షలు



రిలే నిరాహారదీక్షలో పాల్గొన్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్ నిరసనగా టీడీపీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్ష 17వ రోజుకు చేరుకుంది. నిజామాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు దేగాం యదాగౌడ్, బొబ్బ నరసింహ, ముదిరాజ్ శంకర్, గోపి ధర్మారం, అంబిక సత్యనారాయణ, లవంగ రాజు, శ్రీనివాస్ రావు, తరుణ్, సుభాష్‌గౌడ్, నర్సయ్య, రవికుమార్ పాటిల్, నాగేశ్వర్ రావు, మల్ల రెడ్డి, లక్ష్మి యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

దీక్షలో కూర్చున్న మహిళలు

బోధన్‌టౌన్ :

చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా బోధన్‌లో న్యాయ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరాహారదీక్షలు శుక్రవారం 24వ రోజుకు చేరాయి. ఈ దీక్షలో నాగల్‌పల్లి సర్పంచ్ శాఖమూరి సుష్మ, కొప్పర్తి ఉపసర్పంచ్ సామ్రాజ్యం, కొప్పర్తి, నాగల్‌పల్లి గ్రామాలకు చెందిన మహిళలు దీక్షలో కూర్చున్నారు. పరిరక్షణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



నిరసన దీక్షలో పాల్గొన్న మహిళలు

బాగేపల్లి దొడ్డి మైసమ్మ ఆలయ ప్రహారీకి విరాళం

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని బాగేపల్లి గ్రామంలోని దొడ్డి మైసమ్మ ఆలయానికి ప్రహరీ నిర్మాణం కోసం స్థానిక సర్పంచ్ పాముల సాయిలు రూ.10వేలు విరాళంగా అందజేశారు. ఆ డబ్బులతో ప్రహరీ నిర్మాణాన్ని చేపడుతున్నట్లు గ్రామ కమిటీ పేర్కొంది. ప్రహరి నిర్మాణం కోసం సర్పంచ్ ముందుకు రావడం అభినందనీయమని గ్రామ కమిటీ పేర్కొంది.

భారీ మెజార్టీతో గెలిపించాలి

- ధర్పల్లి జెడ్పిటిసి బాజిరెడ్డి జగన్

నవతెలంగాణ-మోపాల్

రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను వచ్చే ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని ధర్పల్లి జెడ్పిటిసి, ఒలంపిక్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాజిరెడ్డి జగన్ తెలిపారు. శుక్రవారం మండలంలోని నర్సింగ్‌పల్లి గ్రామంలో గల ఓ ప్రయివేట్ ఫంక్షన్‌హాల్‌లో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను అత్యంత భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు శ్రీనివాసరావు, పార్టీ అధ్యక్షుడు మోచ్చ శ్రీనివాస్, ఎస్సీ సెల్ కన్వీనర్ కంజర భూమయ్య, సర్పంచులు సిద్ధార్థ, ముత్యంరెడ్డి శ్రావణ్, సాయిరెడ్డి, క్యాతం రవి, సీనియర్ నాయకులు రాజరెడ్డి, ఉమాపతి రావు, నిమ్మల మోహన్‌రెడ్డి, రమేష్, ముత్తెన్న తదితరులు పాల్గొన్నారు.



సమావేశలో మాట్లాడుతున్న జెడ్పిటిసి

బీడీ కార్మికుల పిల్లలకు ఉపకార వేతనాలకు దరఖాస్తులు ఆహ్వానం

నవతెలంగాణ-భీంగల్

కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ ద్వారా బీడీ కార్మికుల పిల్లలకు అందించే ఉపకార వేతనాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బీడీ కార్మికుల ఆసుపత్రి వైద్యులు శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. 1 నుంచి 10వ తరగతి వరకు చదివే బీడీ కార్మికుల పిల్లలు నవంబర్ 30 లోపు, ఇంటర్మీడియట్ నుండి డిగ్రీ వరకు చదివే బీడీ కార్మికుల పిల్లలు డిసెంబర్ 31 లోపు www.scholarships.gov.in వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పూర్తి సమాచారం కోసం భీంగల్ పట్టణ కేంద్రంలో అయ్యప్పనగర్‌లో గల బీడీ కార్మికుల ఆసుపత్రిలో సంప్రదించాలని తెలియజేశారు.

మాజీ వర్ని కోఆప్షన్‌ను పరామర్శించిన జడ్పీ చైర్మన్

నవతెలంగాణ-వర్ని

తెలంగాణ ఉద్యమ కారుడు, వర్ని మండల మాజీ కోఆప్షన్ సభ్యులు ఎజాజ్ మాతృమూర్తి గురువారం ఉదయం 8 గంటల సమయంలో హార్ట్‌ఎటాక్‌తో మృతి చెందగా, విషయం తెలుసుకున్న నిజామాబాద్ జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విట్టల్‌రావు శుక్రవారం ఎజాజ్ స్వగ్రామమైన వర్నిలో వారిని, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఎజాజ్ కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ఇచ్చారు. ఆయనతో పాటు వర్ని సర్పంచ్ భర్త నాగభూషణం, తెలంగాణ శంకర్, శేఖరాజు, తదితరులు పాల్గొన్నారు.



మాజీ కోఆప్షన్ ఎజాజ్‌ను పరామర్శించిన జడ్పీ

కాంగ్రెస్‌తోనే ప్రజా సంక్షేమం


సమావేశంలో మాట్లాడుతున్న టీపీసీసీ ప్రదాన కార్యదర్శి

నవతెలంగాణ-లింగంపేట్

రాష్ట్రంలో ప్రజా సంక్షేమం జరగాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి (మైనార్టీ) రఫీయొద్దీన్ రఫీయొద్దీన్ అన్నారు. శుక్రవారం లింగంపేట మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కామారెడ్డి జిల్లాలో ఎవరికి టికెట్‌లు కేటాయించినా భారీ మెజార్టీతో గెలిపిస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ జండా ఎగురవేయడానికి ముందు ఉండాలని అన్నారు. బిఆర్ఎస్ పాలనపై ఎక్కడా చూసిన ప్రజలు నిప్పులు కక్కుతున్నారన్నారని తెలిపారు. సోనియాగాంధీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను తప్పకుండా ప్రజా సంక్షేమం కోసం అమలు చేస్తామని తెలిపారు.

వాహనాల తనిఖీ

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండలంలోని సంగారెడ్డి అకొల జాతీయ రహదారి 161 పై ఎస్.ఐ కోనా రెడ్డి ఆధ్వర్యంలో పోచారం గేటు వద్ద వాహనాల తనిఖీని ముమ్మరం చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నిక కోడ్ అమలులోకి ఉనందువల్ల జాతీయ రహదారిపై ప్రయాణించే ప్రతి వాహనాన్నీ క్షణ్ణంగా తనిఖీ చేస్తునట్లు తెలిపారు. వాహనాల తనిఖీకి వాహనాదారులు సహకరించాలని, లేకుంటే చట్టపరంగా తగిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. డ్రైవింగ్ పత్రాలు, ఆర్‌సీలు వెంట పెట్టుకోవాలన్నారు. డబ్బుంటే దానికి సంబంధించిన ఆధారాలను చూపాలని పోలీసులు వెల్లడించారు.



కారును తనిఖీ చేస్తున్న ఎస్సై కోనా రెడ్డి



కోడ్ వచ్చే.. బీసీ'బంద్'

- బీసీ చేతివృత్తిదారుల ఆవేదన

నవతెలంగాణ-నిజాంసాగర్

అధికార పార్టీ బీసీ చేతి, కుల వృత్తులకు బీసీ బంధు పథకం తీసుకొచ్చి అమల్లో మాత్రం మమ అనిపించారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. పథకం అమలు నామమాత్రంగా చేపట్టగా.. ప్రస్తుతం ఎన్నికల కోడ్ రావడంతో దరఖాస్తు చేసుకున్న లబ్దిదారులకు నిరాశ ఎదురైంది.

రాష్ట్ర ప్రభుత్వం జూన్ నెలలో చేతి వృత్తి కార్మికులకు బీసీ బందు అని పథకం ప్రవేశపెట్టింది. ఇందుకుగాను బీసీలలో 21 కులాలకు చేతి వృత్తి కార్మికులు గా గుర్తించి వారికి ముడి సరుకు, పనిముట్లు కొనడానికి ఆర్థిక సాయంగా ఒక లక్ష రూపాయలు సహాయం చేస్తానని ప్రకటించింది. అందుకుగాను నిజాంసాగర్ మండలంలో మొత్తం 741 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో నుంచి 585 మందిని అర్హులుగా గుర్తించారు.

అయితే ఈ సహాయం ప్రతి నెల అందజేస్తామని, నిరంతర ప్రక్రియ అని పాలకులు చెప్పుకుంటూ వచ్చారు. కానీ గత నాలుగు నెలలుగా కేవలం 51 మంది లబ్దిదారులకు మాత్రమే చెక్కులు పంపిణీ చేసి మమ అనిపించారు. మిగతా 534 మందికి ఈ పథకం ఎప్పుడు వస్తుందో అసలు ఇస్తారో ఇవ్వరో అని ఎదురుచూస్తున్నారు. చెక్కులు అందిన వారు సైతం బీఆర్ఎస్ నాయకులే అని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అర్హులను విస్మరించారని, మంజూరైన వారికి సైతం సకాలంలో అందజేయలేదని, ఇప్పుడు అడిగితే కోడ్ అని చెప్తూ తప్పించుకుంటున్నారని లబ్దిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదవశాత్తు వలకు చిక్కుకొని ఒకరు మృతి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి


మృతిచెందిన సాయిలు

చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు వలలో చిక్కుకొని జాలరి మృతి చెందిన ఘటన ఎల్లారెడ్డి మండలం సాతెల్లి గ్రామంలో శుక్రవారం ఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపినా ప్రకారం నిజాంసాగర్ బ్యాక్ వాటర్ లో చేపలు పట్టడానికి జాలరి సాయిలు (30) రోజు మాదిరిగా గురువారం వెళ్లాడు. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో మరుసటి రోజు జాలర్లు చేపల వేటకు వెళ్లగా నిజాంసాగర్ బ్యాక్ వాటర్‌లో మృతదేహం కనిపించింది. చేపలు పట్టే క్రమంలో చేపల వలకు చిక్కుకొని మృతి చెందినట్లు తెలిపారు. స్థానిక ఎస్ ఐ గణేష్ సంఘటన స్థలానికి చేరుకొని శవాన్ని పోస్టు మార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు.

పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య


మృతి చెందిన సంతోష్ (ఫైల్)

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండల కేంద్రానికి చెందిన ఎర్ర మైసని సంతోష్ (25) యువకుడు కడుపునొప్పి భరించ లేక గురువారం రాత్రి 10 గంటల సమయంలో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే బాన్సువాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఉండగా శుక్రవారం ఉదయం ఏడు గంటలకు సమయంలో మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కోనరెడ్డి తెలిపారు.

కురుమ యువ చైతన్య సమితి నూతన కమిటీ ఎన్నిక


యువ చైతన్య నూతన కమిటీ ఏర్పాటు

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూరు మండలం పెద్ద మల్లారెడ్డి గ్రామంలో కురుమ యువ చైతన్య సమితి నూతన కమిటీని జిల్లా అధ్యక్షులు మామిడి సంజీవ్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులుగా భూపాల్, ఉపాధ్యక్షులు మహిపాల్, వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లేష్, ప్రధాన కార్యదర్శి కొమురయ్య, కోశాధికారి మల్లేష్, ప్రచార కార్యదర్శి హరీష్, కార్యదర్శి శ్రీకాంత్ లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్, జిల్లా ఉపాధ్యక్షుడు స్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్, మండల సలహాదారులు సాగర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థుల ప్రచారంపై మానిటరింగ్ సెల్

- మీడియా సెంటర్‌ను ప్రారంభించిన కలెక్టర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

రాష్ట్ర శాసన సభ ఎన్నికలను పురస్కరించుకుని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం(కలెక్టరేట్)లోని రూమ్ నెం.28 లో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ (ఎం.సీ.ఎం.సీ)ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. మీడియా కోసం అందుబాటులో ఉన్న సదుపాయాలను, ఎంసిఎంసి పనితీరుకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియా సెంటర్ ద్వారా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు అందించాలని సూచించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు.


మీడియా సెంటర్‌ను ప్రారంభించిన కలెక్టర్

ఎంసిఎంసి సెల్ ద్వారా చెల్లింపు వార్తలను గుర్తించడం, ప్రచురణ, ముందస్తు అనుమతి లేకుండా ప్రకటనలను ప్రసారం చేయడం, సంబంధిత అభ్యర్థి ప్రచార వ్యయంలో వాటిని లెక్కించడం, సోషల్ మీడియాలో అభ్యర్థులు రాజకీయ పార్టీల ప్రకటనలకు వంటివి సకాలంలో ఆమోదిస్తూ, మంజూరు చేయాలని సూచించారు. శాటిలైట్ ఛానెల్స్ లో వచ్చే వార్తలను పూర్తిస్థాయిలో రికార్డు చేయాలని అన్నారు. వార్తా పత్రికలు, ఈ-పేపర్‌లు, టెలివిజన్ ఛానెల్‌లు, స్థానిక కేబుల్ నెట్‌వర్క్‌లు, సోషల్ మీడియా, మూవీ హౌస్‌లు, సంక్షిప్త సందేశాలు, ఇతర ఆడియో-వీడియో విజువల్ మీడియాలతో సహా ప్రకటనలను ఎంసిఎంసి నుండి ముందస్తు అనుమతి పొందిన తర్వాత మాత్రమే విడుదల చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ వెల్లడించారు.

సోషల్ మీడియాలో వచ్చే పోస్టుల పై ప్రత్యేక దృష్టిసారించాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి అతిక్రమించిన పోస్టులపై చట్ట ప్రకారం చర్యలు ఉంటాయి అని స్పష్టం చేసారు. ఎన్నికలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించడానికి మీడియా పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ కోరారు.

ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల అధికారిణి ఎస్.పద్మశ్రీ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ వేణీ ప్రసన్న, కలెక్టరేట్ ఏ.ఓ ప్రశాంత్, ఎన్నికల పర్యవేక్షకుడు పవన్, సిబ్బంది పాల్గొన్నారు.

జీవన్ జ్యోతి బీమాయోజన చెక్కు అందజేత

నవతెలంగాణ-పిట్లం

మండలంలోని చిన్న కొడప్ గల్ గ్రామానికి చెందిన మహమ్మద్ మోసిన్‌కు ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పథకం కింద మంజూరైన రెండు లక్షల రూపాయల చెక్కును శుక్రవారం అందజేసినట్లు ఎస్ బి ఐ బ్రాంచ్ మేనేజర్ కళ్యాణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నసీమా బేగం గతములో ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమ యోజన పథకంలో సభ్యురాలిగా కొనసాగుతూ ఇటీవల మృతి చెందడంతో నామిని గా ఉన్న బాధితురాలి కుమారుడు మమ్మద్ మోసిన్ కు బీమా చెక్కు అందజేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది బాల్ రాజ్ , విజయ్ , అబ్దుల్ ఆఫీజ్ తదితరులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు


విత్తనాల దుకాణాలలో తనిఖీలు చేస్తున్న అధికారులు

నవతెలంగాణ-సదాశివనగర్

సదాశివనగర్ మండలం ఉత్తనూర్ గ్రామంలో పురుగు మందుల, విత్తనాల దుకాణాలను, సొసైటీని ఇంచార్జి ఏడిఏ శ్రీకాంత్ సదాశివనగర్ మండల వ్యవసాయ అధికారి ప్రజాపతితో కలసి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విత్తనాలు, పురుగు మందులు, ఎరువుల వ్యాపారులు ఎవరూ నకిలీ సరుకులు అమ్మరాదని, ప్రభుత్వం నుండి అనుమతి పొందిన విత్తనాలు మాత్రమే అమ్మకాలు చేపట్టాలని సూచించారు. కల్తీ లేని ఎరువులను, పురుగు మందులు అమ్మాలని... కాలపరిమితి ముగిసిన పురుగు మందులు, నిషేధిత మందులు అమ్మరాదన్నారు.కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ ప్రభాకర్ రావు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా లేఅవుట్లు

- నోటీసులు ఇచ్చినా పట్టని వైనం
- డివిజన్ అధికారులకు నివేదిక సమర్పన

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండలంలోని హెచ్ కేలూర్ గ్రామపంచాయతీ పరిధిలో అక్రమంగా లేఅవుట్ ఏర్పాట్లు జోరుగా కొనసాగుతున్నాయి. అక్రమ లేఅవుట్ ఏర్పాట్లపై గ్రామపంచాయతీ అధికారులు నోటీసులు జారీచేసినా యజమాన్యాలు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. దీంతో అక్రమ లేఔట్‌లపై జీపీ అధికారులు.. మండల, డివిజన్ స్థాయి పంచాయతీ అధికారులకు నివేదిక సమర్పించినట్టు సమాచారం.

పంచాయతీ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా లేఅవుట్లు ఏర్పాటు చేసే వాటికి ఎలాంటి అనుమతులు లేవని గ్రామపంచాయతీ కార్యదర్శి రాములు తెలిపారు. అనుమతి లేకుండా లేఅవుట్ వెయ్యకూడదని రెండు నెలల క్రితం పంచాయతీ అధికారి నోటీసులు జారీచేసినా అక్రమ లేఅవుట్ల యజమాన్యాలు పంచాయతీ అధికారి నోటీస్‌లను బేఖాతర్ చేయడం గమనార్హం. రెండు నెలల కాలంగా ఉన్నత అధికారుల దృష్టికి నివేదిక వెళ్లినా అక్రమ లేఅవుట్ల పట్ల అధికారులు దృష్టి సారించడం లేదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే వెంచర్‌లు చేసి ప్లాట్లు విక్రయాలు చేపడుతున్నట్టు భోగట్ట. రెవెన్యూ శాఖ నాలా పర్మిషన్ ఇచ్చారా లేదా అన్నది కూడా తెలియని పరిస్థితి. ఒకవేళ నాలా అనుమతి పొందినా పంచాయతీ పర్మిషన్ తప్పనిసరి. పంచాయతీ నోటీసుకు పట్టించుకోకుండా అక్రమంగా లేఅవుట్లు వేస్తూ లక్షలాది రూపాయలు ప్లాట్ల అమ్మకాల ద్వారా యజమాన్యాలు ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ జేబులు నింపుకుంటున్నారని ఆరోపణలు ప్రజల్లో వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు అక్రమ లేఅవుట్ల ఏర్పాటుపై ప్రత్యేకంగా తనిఖీలు చేపట్టి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


అక్రమ లేఅవుట్లు


గ్రామ పంచాయతీ కార్యాలయం

పోస్టాఫీస్ పథకాలు వినియోగించుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

నవతెలంగాణ-భిక్కనూర్

పోస్ట్ ఆఫీస్ సేవలను, పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ ఇన్‌స్పెక్టర్ శ్రావణ్ కుమార్ తెలిపారు. శుక్రవారం భిక్కనూరు పట్టణంలోని పోస్ట్ ఆఫీస్ కార్యాలయంలో పోస్ట్ ఆఫీస్ పథకాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ పి ఎం రాజేందర్ రెడ్డి, ఎంఒ వెంకటరామిరెడ్డి, నరసింహారెడ్డి, సిబ్బంది సురేష్ కుమార్, సుధాకర్, రచన, రామ్ చంద్రం, సిద్ధ రాములు, రాజు, రాకేష్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

జాయింట్ డైరెక్టర్‌గా నారెడ్డి సునందరెడ్డి

నవతెలంగాణ-రామారెడ్డి



రామారెడ్డికి చెందిన నా రెడ్డి సునందరెడ్డి ఉద్యానవన శాఖ జెయింట్ డైరెక్టర్ గా పదోన్నతి పొందడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. రైతు కుటుంబంలో పుట్టి, రామారెడ్డి ప్రభుత్వ బాలికొన్నత పాఠశాలలో విద్యనభ్యసించి ప్రభుత్వ ఉద్యోగానికి ఎంపికై, ఉద్యానవన శాఖలో అంచలంచెలుగా పదోన్నతులు పొంది, హైదరాబాద్‌లో ఉద్యానవన శాఖ జెయింట్ డైరెక్టర్‌గా పదోన్నతి పొందడం అభినందనీయమని అన్నారు. ఆమెను ఆదర్శంగా తీసుకొని, కష్టపడి చదివి ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని సూచించారు.

విద్యార్థినుల ర్యాలీ


అమృత్ కళాశాల యాత్ర నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్, విద్యార్థినిలు

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని మర్కల్ తెలంగాణ సంఘీక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో అమృత్ కళాశాల యాత్ర శుక్రవారం నిర్వహించారు. మేరీ మిట్టీ మేరా దేశ్‌లో భాగంగా ర్యాలీ కళాశాల ఆవరణలో నిర్వహించి పిడికెడు మట్టి పిడికెడు బియ్యాన్ని సేకరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. రాధిక, వైస్ ప్రిన్సిపల్ వి. రేణుక, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ సి. అనిత, కమిటీ సభ్యులు ఎం. డి. ఆఫ్షా అధ్యాపకులు విద్యార్థినులు పాల్గొన్నారు.

సమిష్టి భాగస్వామ్యంతో
క్రియాశీలకంగా పనిచేయాలి

- ఎన్నికలపై అధికారులకు కలెక్టర్ జితేశ్ వి పాటిల్ సూచన

నవతెలంగాణ-కామారెడ్డి

ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించుటకు నియమించిన అన్ని విభాగాల అధికారులు సమిష్టి భాగస్వామ్యంతో క్రియాశీలకంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లోని ఎన్నికల కంట్రోల్ రూమ్ లో నోడల్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్ర మోహన్ తో కలిసి మాట్లాడారు. ఎన్నికల విధులకు సంబంధించి పూర్తి అవగాహన కలిగి, ఎటువంటి ఉల్లంఘనలు చేయరాదని అన్నారు. జిల్లాలో ఎక్కడైనా అక్రమ మద్యం, డబ్బు, సరుకుల పంపిణి రవాణా జరిగినప్పుడు ప్రజలు సి విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. ఫిర్యాదుదారు వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. రూ.50 వేలకు మించి ఆధారాలు లేని డబ్బులను స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. 10 లక్షల రూపాయలకు మించి డబ్బు కలిగి ఉంటె ఆదాయపన్ను శాఖాధికారులకు అందజేస్తామన్నారు. నియోజక వర్గానికి మూడు చొప్పున ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశామని, వారు ఎక్కడ ఫిర్యాదు అందిన తక్షణమే స్పందించి చర్యలు తీసుకుంటారని అన్నారు. పోలిసు, ఆబ్కారీ శాఖలు చెక్ పోస్ట్ ల వద్ద అప్రమత్తంగా ఉండాలన్నారు. సువిధ యాప్ ద్వారా ముందస్తుగా అనుమతులు తీసుకొని సభలు, సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలని, వీటంతటిని వీడియోగ్రఫీ చేయనున్నట్టు తెలిపారు. ఎలాంటి ఒత్తిడిలకు, లొంగకుండా పారదర్శకంగా పనిచేయాలని, ఏ చిన్న తప్పు జరిగిన ఎవరిని వదిలిపెట్టవద్దని, వంద శాతం నిబంధనలు తు.చ. తప్పకుండా అమలు చేయాలని అన్నారు. ఎన్నికల సంఘం వేలెత్తి చూపని విధంగా వివిధ విభాగాలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో నోడల్ అధికారులు పాల్గొన్నారు.


అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్

వికలాంగులకు ఫిజియోథెరపీ పరీక్షలు


ఫిజియోథెరపీ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూరు పట్టణంలోని మండల మహిళా సమైక్య ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉచిత ఫిజియోథెరపీ పరీక్షలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారి రమేష్ బాబు మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలలోని పిల్లలకు చదువుతోపాటు ఆటపాటలు నేర్పించనున్నట్టు తెలిపారు. 15 రోజులకు ఒకసారి మూగ, చెవిటి వారికి ఫిజియోథెరపీ చేయడానికి నిజామాబాద్ నుండి ముగ్గురు ఫిజియోథెరపీ వైద్యుల ద్వారా పరీక్షలు చేయిస్తున్నట్టు తెలిపారు. అర్హత గల వారికి సదరం సర్టిఫికెట్, బస్ పాస్‌లు అందజేస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని మండలంలోని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బ్యాంక్ లింకేజ్ అధికారి రవీందర్రావు, ఏపీఎం శ్రీనివాస్, ఐకెపి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీలు

నవతెలంగాణ-భిక్కనూర్

ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్న సందర్భంగా భిక్కనూరు పట్టణంలోని 44వ జాతీయ రహదారిపై స్థానిక టోల్ ప్లాజా వద్ద పోలీసులు ముమ్మరంగా వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్న సమయంలో నగదును వాహనాలలో తీసుకెళ్లరాదని, తనిఖీల సమయంలో పోలీసులకు వాహనదారులు సహకరించాలని తెలిపారు. ఈ తనిఖీలలో ఎస్‌ఐ సాయికుమార్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.


వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీలకు
కాంగ్రెస్ టికెట్లలో న్యాయం చేయాలి

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీలకు కాంగ్రెస్ టికెట్లలో న్యాయం జరగాలని ఇండియన్ ఓవర్‌సీస్ ఉపాధ్యక్షుడు సుధాకర్‌గౌడ్ సోషల్ జస్టిస్, ఎంపవర్‌మెంట్ కన్వీనర్, సెంట్రల్ ఎలక్షన్ కమిటీ స్క్రీనింగ్ మెంబెర్ - సల్మాన్ ఖుర్షిద్‌కు వినతిపత్రాన్ని శుక్రవారం అందజేశారు. దీనికి ఖుర్షిద్ సానుకూలంగా స్పందించి రాహుల్ గాంధీతో, ఖర్గేతో చర్చించి డిక్లరేషన్ అనుగుణంగా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని ఇండియన్ కాంగ్రెస్, ఇండియన్ ఓవర్సీస్ ఇన్ యూకే ఉపాధ్యక్షులు ఆర్.సుధాకర్‌గౌడ్ తెలిపారు.



బీఆర్ఎస్‌లో చేరిన సాటాపూర్ యువత



నవతెలంగాణ-రెంజల్

మండలంలోని సాటాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్, బిజెపి, పార్టీల నుంచి యువత బీఆర్ఎస్‌లో చేరినట్లు సర్పంచుల ఫోరం జిల్లా ఉపాధ్యక్షులు వికార్ భాషా తెలిపారు. పార్టీలో చేరిన వారిలో గుండ్ల మధు, మీసాల గణేష్, మేదరి మధు, గుండ్ల రమేష్ తదితరులున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షులు హాజీ ఖాన్, శ్రీకాంత్, కృష్ణ, గ్రామంలోని యువత పాల్గొన్నారు.

బదిలీలపై తపస్ పోరుబాట



ఏడీకి వినతిపత్రం అందజేత

నవతెలంగాణ-కంఠేశ్వర్

బదిలీపై వెళ్లిన వారిని వెంటనే రిలీవ్ చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భట్టు బద్రినాథ్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఏడి నాగ జ్యోతికి వినతిపత్రం అందజేశారు. బదిలీలతో ఉపాధ్యాయుల సమస్యలు తీరలేదని ప్రత్యామ్నాయం వచ్చేవరకు ఉపాధ్యాయులను వారి పాఠశాల నుంచి రిలీవ్ చేయడం లేదని, నిజానికి బదిలీ షెడ్యూల్లో ప్రత్యామ్నాయం వచ్చేవరకు రిలీవ్ చేయకూడదనే నిబంధన లేదని, అలా రిలీవ్ చేయకపోవడం వల్ల ఎక్కడి బదిలీలు అక్కడ నిలిచిపోయాయని, బదిలీల ప్రయోజనం ఉపాధ్యాయులకు చేరడం లేదని, అన్ని జిల్లాల్లో బదిలీలు పూర్తి అయ్యాయని, మన జిల్లాలో మాత్రం ఇంకా నత్తనడకలో ఉందని అన్నారు. కాబట్టి ప్రత్యామ్నాయ ఉపాధ్యాయులు రాకున్నా కూడా ఉపాధ్యాయులను రిలీవ్ చేసి సమస్యను పరిష్కరించాలని, స్కూల్ అసిస్టెంట్లు, పీడీలు, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం, గ్రేడ్ వన్ పండితులకు న్యాయం చేయాలని, నిర్ణయం తొందరగా తీసుకోవాలని డీఈవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బద్రీనాథ్, సంఘం బాధ్యులు రామానుజాచారి, సురేందర్, తిరుపతి, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు

- మేరు సంఘం ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే బిగాల గణేష్



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్తా



హాజరైన మేరు కులస్తులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రతి ఇంటికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా అన్నారు. మేరు సంఘం ఆత్మీయ సమ్మేళనంలో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే గణేష్ బిగాల శ్రీరామ గార్డెన్స్‌లో మేరు ఆత్మీయ సమ్మేళనంలో శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణేష్ బిగాల మాట్లాడుతూ.. 'ముఖ్యమంత్రి కేసిఆర్ పాలనలో ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారు. మేరు సంఘం కమ్యూనిటీ హల్ నిర్మాణానికి 40లక్షలు నిధులు మంజూరు చేసాం. ప్రభుత్వం బిసి కులస్థులకు అందించే రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని మేర కులస్థులకు అందజేశాం. నిజామాబాద్ నగరంలో పోటాపోటీగా అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు చేసాం. ప్రతి డివిజన్‌లో సిసి రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాం. స్థానిక యువతకు ఉపాధి కల్పించేందుకు ఐటీ టవర్‌ని నిర్మించాం. వృత్తి నైపుణ్య శిక్షణ ఇవ్వడానికి న్యాక్ భవనాన్ని నిర్మించాం. వచ్చే తరాల కోసం మంచి నీటి సమస్య రాకుండా మిషన్ భగీరథ పైప్ లైన్‌లు నిర్మించాము. ఎల్లమ్మ గుట్ట రైల్వే కమాన్ వద్ద ఆర్‌యుబీని నిర్మించాం. శ్మశానవాటిక అనే అనుభూతి కలగకుండా ఆధునిక సదుపాయలతో వైకుంఠధామాలు నిర్మించాం. మరింత అభివృద్ధి కోసం మరోసారి కారుగుర్తుకి ఓటు వేసి గెలిపించాలి'. అని కోరారు. కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతూ కిరణ్, సిర్ప రాజు, సామ హనుమంతు రావు, కొత్తూరు చంద్రకాంత్, మంతెన దశరథ్, ఎన్ను సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన



మాట్లాడుతున్న గటాడి ఆనంద్

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని సివిఆర్ జూనియర్ కళాశాలలో విద్యార్థి విద్యార్థులకు సమాచార హక్కు చట్టంపై శుక్రవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి విద్యార్థి దశ నుంచి ప్రశ్నించే తత్వం అలవర్చుకోవాలని న్యాయవాది గటాడి ఆనంద్ తెలిపారు. గ్రామస్థాయి నుంచి మొదలుకొని పార్లమెంట్ వరకు తమకు కావాల్సిన సమాచారం ఈ చట్టం ద్వారా తెలుసుకోవచ్చని తెలిపారు. జీవించే హక్కు భంగం కలిగించే సందర్భంలో 48 గంటల్లో సమాచారం ఇవ్వాలని తెలిపారు. గ్రామస్థాయి సంవత్సరం కావాలంటే ఎలాంటి రుసుము కట్టనవసరం లేదని, మండల స్థాయికి రూ.5, జిల్లా స్థాయికి 10 రూపాయలు, అలాగే దరఖాస్తుదారునికి తప్పుడు సమాచారం ఇచ్చిన అసంపూర్తి సమాచారం ఇచ్చిన వారికి రోజుకు 250 నుంచి 25 వేల వరకు జరిమానా విధించే అవకాశం ఉంటుందని తెలిపారు. అలాగే సెక్షన్ 2జే(1) ప్రకారం అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో 1గంటసేపు ఉచితంగా రికార్డులు తనిఖీలు చేసే అధికారం ఈ చట్టం కల్పించిందన్నారు. అలాగే ఈ చట్టం ద్వారా సాధించిన విజయాలు, ఎలా దరఖాస్తు చేసుకోవాలో వివరంగా చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జాకీర్, లెక్చరర్లు మల్లికార్జున్, దిలీప్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పనులు పూర్తయ్యేదెప్పుడో..?

- వంతెన నిర్మాణ పనులు పూర్తి
- రోడ్డు పనులు కంప్లీట్ కాలే
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



వంతెన నిర్మాణం పూర్తయినా.. పూర్తికాని రోడ్డు పనులు

నవతెలంగాణ-మోర్తాడ్

జాతీయ రహదారి 63 నుంచి తిమ్మాపూర్ వెళ్లే రహదారిపై వంతెన నిర్మాణ పనులు గత ఐదు నెలలుగా కొనసాగుతూనే ఉన్నాయి. గత జూన్ నెలలో రూ.65లక్షల నిధులతో పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ వంతెన నిర్మాణ పనులు పూర్తిచేసి రహదారికి ఇరువైపులా రహదారి నిర్మించాల్సి ఉన్నప్పటికీ ఆ పనులను ప్రారంభించకపోవడంతో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రహదారి నుంచే వాహనాలు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

వంతెన నిర్మాణ పనులు రహదారి కంటే చాలా పైభాగంలో నిర్మాణ పనులు చేసిన కాంట్రాక్టర్ రెండు వైపులా రహదారిని ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పాలవుతున్నారని ఆరోపిస్తున్నారు. ఈ రహదారి గుండా ప్రతి శుక్రవారం తడపాకల్ గోదావరి నదికి వందలాది వాహనాలు వెళుతూ ఉంటాయి. తక్షణమే వంతెనకు ఇరువైపులా రహదారిని నిర్మించాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

విద్యార్థి దశలో ఇంటర్మీడియట్ కీలకమైనది

- డిఐఈఓ రఘురాజ్



మాట్లాడుతున్న డీఐఈవో రఘురాజ్

నవతెలంగాణ-కోటగిరి

విద్యార్థి దశలో ఇంటర్మీడియట్ కీలకమైనదని డిఐఈఓ రఘురాజ్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. అనంతరం జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రఘురాజు మాట్లాడుతూ విద్యార్థి దశలో ఇంటర్మీడియట్ కీలకమని, ప్రభుత్వ కళాశాలలో ఈ సంవత్సరం నుంచి ఇంగ్లీషు ల్యాబ్ ప్రారంభించామని, అన్ని అర్హతలు ఉన్న అధ్యాపకులు ద్వారా విద్యాబోధన నడుస్తుందన్నారు. విద్యార్థులు ప్రతిరోజు కళాశాలకు వచ్చి చదువుకోవాలని, క్రమశిక్షణతో మెలగాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వర్ని కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై
పాలకులను నిలదీయాలి



మాట్లాడుతున్న దాసు

నవతెలంగాణ-ఆర్మూర్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పాలకులను నిలదీయాలని సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి దాసు ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. నరేంద్రమోడీ ఎన్నికల్లో ఉపాధి భద్రత, ప్రతి ఏటా రెండు కోట్ల కొలువులు, పేదల జన్‌ధన్ ఖాతాలో 15 లక్షల జమ, ప్రభుత్వ రంగ సంస్థల, బీడీ లాంటి కుటీర పరిశ్రమల రక్షణ హామీలను విస్మరించి కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను తెచ్చారని ఆయన అన్నారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు అప్ప జెప్పే కుట్రతో మూడు వ్యవసాయ వ్యతిరేక నల్ల చట్టాలను తీసుకొచ్చి, దేశాన్ని అప్పుల కొంపగా మార్చినందుకు బిజెపి ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని దాసు అన్నారు. కెసిఆర్ రాష్ట్రంలో మూడు లక్షల కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ కార్మికులను పర్మినెంట్ చేస్తానని, పేదలకు డబుల్ బెడ్రూములు ఇస్తామని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 1,40,000 పోస్టులను వెంటనే భర్తీ చేస్తానని, దళితున్ని ముఖ్యమంత్రి చేస్తానని అర్హత కలిగిన దళిత కుటుంబానికి మూడెకరాల భూమి ఇస్తానని మాట ఇచ్చి, మోసం చేశారని, కనుక బీఆర్ఎస్ పార్టీని నిలదీయాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. 9 సంవత్సరాలలో పెట్రోలు, చమురు ఉత్పత్తి ధరలు, నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, విద్య, వైద్య రంగ సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైందని, రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో నెట్టిన కేసీఆర్‌ను ప్రశ్నించాలని దాసు అన్నారు. పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలను నిలదీస్తూ, ఉద్యమించి, మెరుగైన సమాజం కోసం ఐక్యంగా పోరాడుదామని దాసు ప్రజలకు పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ నాయకులు బి.సూర్యశివాజీ, ఖాజా మొయినుద్దీన్, వి.బాలయ్య అబ్దుల్, ఎస్.రవి తదితరులు పాల్గొన్నారు.

యూనివర్సిటీలో అంబరాన్నింటిన బతుకమ్మ సంబరాలు



డిచ్‌పల్లి : బతుకమ్మ వేడుకల్లో ప్రొఫెసర్లు

నవతెలంగాణ-డిచ్‌పల్లి/ఆర్మూర్

తెలంగాణ యూనివర్సిటీలో బతుకమ్మ సంబరాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గూనుగు, తంగేడు, బంతి, పోకబంతి, కట్ల, గుమ్మాడి, చామంతి, టేక్ పువ్వులతో ఎంతో బతుకమ్మలను పేర్చి ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. మహిళా విభాగం అధ్వర్యంలో నిర్వహించిన ఈ బతుకమ్మ సంబరాలకు విశిష్ట అతిథిగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.యాదగిరి పాల్గొని బతుకమ్మలకు, వెంపల్ చెట్టుకు, తులసి చెట్టుకు పూజ చేశారు. కార్యక్రమంలో యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ సిహెచ్.ఆరతి, మహిళా విభాగం అధికారిణి డా.భ్రమరాంబిక, కంట్రోలర్ ప్రొఫెసర్ అరుణ, ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్, ఈసీ మెంబర్ ప్రొఫెసర్ రవీందర్‌రెడ్డి, అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ సంపత్ కుమార్, సారంగపూర్ క్యాంపస్ ప్రిన్సిపాల్ డా.సాయిలు, కళల పీఠాధిపతి ప్రొఫెసర్ త్రివేణి, లావణ్య, డా.నందిని, నీలీమా, సూపరిండింటెంట్ ఉమారాణి తదితర అధ్యాపక, అధ్యాపకేతర, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆల్ ఫోర్స్ నరేంద్ర పాఠశాలలో బతుకమ్మ సంబరాలు

ఆర్మూర్ : పకృతి పులకరించే ఆరాధించే పండుగ బతుకమ్మ అని ఆల్‌ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని బ్రాహ్మణపల్లి క్రాస్‌రోడ్డులో గల ఆల్‌ఫోర్స్ నరేంద్ర పాఠశాలలో బతుకమ్మ ఉత్సవ సంబరాలను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన తెలంగాణ సంస్కృతిని చాటి చెప్పిన పండుగ బతుకమ్మ అని అన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన మా ఊరి బతుకమ్మ.. బంగారు బతుకమ్మ.. చిట్టి బతుకమ్మ.. దసరా జాతర పోదాం నృత్యాలు చాలా ఆకర్షించాయి. ప్రత్యేకంగా ప్రాంగణంలో నిర్వహించినటువంటి దసరా మహోత్సవ సంబరం అంబరాన్నంటింది. కార్యక్రమంలో 150 మంది విద్యార్థినిలు సాంప్రదాయ దుస్తుల్లో విచ్చేసి పాఠశాల పండగ వాతావరణాన్ని రెట్టింపు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఆర్మూర్ : బతుకమ్మ వేడుకల్లో ఆల్‌ఫోర్స్ విద్యార్థులు

న్యాయశాస్త్ర విభాగంలో జూనియర్ సివిల్‌జడ్జి సంపత్ చల్లారికి డాక్టరేట్ ప్రదానం



నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీలోని న్యాయశాస్త్ర కళాశాల విభాగంలో ఓపెన్ వైవా వాయిస్ చెన్నూర్ జూనియర్ సివిల్ జడ్జి సంపత్ చల్లారికి పిహెచ్‌డి వైవా శుక్రవారం న్యాయశాస్త్ర కళాశాలలో న్యాయశాస్త్ర పరిశోధక విద్యార్థి చెన్నూరు జూనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వహిస్తున్న సంపత్ చల్లారికి బహిరంగ ముఖ పరీక్ష వైవా వోస్‌ను న్యాయశాస్త్ర బోర్డ్ ఆఫ్ చైర్మన్, పూర్వ సంపాక ప్రిన్సిపాల్ డాక్టర్ జెట్లింగ్ ఎల్లోసా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వైవా వాస్‌కు న్యాయశాస్త్ర పీఠాధిపతి ప్రొఫెసర్ ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ పరిశోధకులు ఈ సిద్ధాంత గ్రంథాన్ని న్యాయ కళాశాల రిటైర్డ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎల్.శోభారాణి పర్యవేక్షణలో చేశారు. కానీ వారు అమెరికా దేశంలో ఉండటం వల్ల వారి తరఫున తెలంగాణ విశ్వవిద్యాలయ ఆదేశాల అనుసారంగా డాక్టర్ జెట్లింగ్ ఎల్లోసా ఈ వైవా వాయిస్‌కు సంపాదకులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో న్యాయ కళాశాల విభాగాధిపతి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ప్రసన్నరాణి, పూర్వ విభాగపతి డాక్టర్ బి.స్రవంతి, తెలంగాణ వర్సిటీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సిహెచ్ ఆరతి, సాంఘికశాస్త్ర పీఠాధిపతి ప్రొఫెసర్ గంట చంద్రశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

పెంచిన వేతనంతో పాటు పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

నవతెలంగాణ-ముప్కాల్

మధ్యాహ్న భోజన కార్మికులకు పెంచిన వేతనంతో పాటు బకాయి ఉన్న పెండింగ్ బిల్లులు విడుదల చేస్తామని చెప్పి ప్రభుత్వం కార్మికులను మోసం చేస్తుందని, పండుగ జరుపుకోలేని పరిస్థితిని కార్మికులు ఎదుర్కొంటున్నట్లు తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ఉపాధ్యక్షులు తోపునూరు చక్రపాణి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు శుక్రవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి గంగాధర్, రామచందర్, కవిత పాల్గొన్నారు.

దోమల పట్ల అప్రమత్తంగా ఉండాలి



పోతంగల్ : ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య విస్తరణ అధికారి

నవతెలంగాణ-పోతంగల్/ఎడపల్లి

ప్రజలు దోమల పట్ల అప్రమత్తంగా ఉండాలని మండల ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్ అన్నారు. డ్రై డే డ్రై డే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సిబ్బందితో కలిసి దోమలేడిగి, కరేగాం, హంగార్గ గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లార్వా గుర్తింపు ఎలా తొలగించాలనే దానిపైన అవాగాహన కల్పించారు. ఈ గ్రామాలలో గల మురికి కాలువలు, ఇంటి పరిసరాలు సిబ్బందితో కలిసి క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రజలను ఒక దగ్గర సమావేశం ఏర్పాటు చేసి దోమల ద్వారా వచ్చే వ్యాధుల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సాయికుమారి, ఆరోగ్య కార్యకర్తలు సవిత, విజయ, ఆశాలు రేష్మ, కరుణ తదితరులు పాల్గొన్నారు.

కుర్నాపల్లిలో..

ఎడపల్లి : మండలంలోని కుర్నపల్లి గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం ఆధ్వర్యంలో వైద్యులు ఫ్రైడే డ్రై డే లార్వా పై సర్వే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించారు. గ్రామాల్లోని పల్లె ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే చుట్టూ పరిసరాల పరిశుభ్రతను పాటించాలని వైద్యాధికారి రాజ్‌కుమార్ అన్నారు.

ఇంటి ముందు ఇంటి పక్కన పరిసర ప్రాంతంలో చెత్తచెదారం అతిగా ఉంటే దోమలు, ఈగలు వాలి గుడ్లు పెట్టడం వల్ల లార్వా అతి ఎక్కువగా అవుతుందని ఆయన గుర్తు చేశారు. లార్వ నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై స్థానిక మహిళలకు ప్రజలకు ఆయన అవగాహన కల్పించారు. వర్షాకాలం పూర్తి చలికాలం ప్రారంభమైనందున గ్రామీణ ప్రాంత ప్రజలు రాత్రివేళలో దోమలు ఇండ్లల్లోకి రాకుండా ముందస్తు చర్యగా డోర్ కాటన్ లేదా తలుపులు అడ్డంగా వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి లావణ్య తదితరులు పాల్గొన్నారు.